ఉచిత ఇసుక ఎక్కడ బాబూ

- ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులైనా హామీ అమలు చేయలేదని ఆగ్రహం
- భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక అవస్థలు పడుతున్నారని ఆవేదన
- ఉచిత ఇసుక హామీ వెంటనే అమలు చేయాలని ధర్నాలు



విస్సన్నపేటలో ధర్నా చేస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఉచిత ఇసుక హామీ అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండపల్లి రైల్వేస్టేషన్ సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికులు సీఐటీయూ నాయకులతో కలిసి శుక్రవారం ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ఇసుక ఉచితమని హామీ ఇచ్చిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అధిక ధరలకు విక్రయించడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలో భవన నిర్మాణ రంగంలో సుమారు 1.50 లక్షల మంది కార్మికులు పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇసుక కొరతతో పనులు లేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సంక్షేమ బోర్డు పునఃప్రారంభించి పెండింగ్ క్లైమ్‌లు పరిష్కరించాలని, సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఇసుక క్వారీలు అన్నీ తెరిపించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి మహేష్, నాయకులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

● **ఎ.కొండూరు:** సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఉచిత ఇసుక హామీ అమలు చేయాలని కోరుతూ జూనియర్ అసిస్టెంట్ రాముకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం ఎ.కొండూరు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు, బిల్డింగ్ కార్మికులు పాల్గొన్నారు.

● **ఆగిరిపల్లి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం ఆగిరిపల్లి మండల కార్యదర్శి నాగరాజు, నాయకులు ముత్యాల నరేష్, సత్తు కోటేశ్వరరావు నవీన్ కుమార్, నాగేశ్వరరావు, రజిని, పాల్గొన్నారు.

విస్సన్నపేట: స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద సీపీఎం, సీఐటీయూ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి వందరోజులు పూర్తయినా ఇంకా ఉచిత ఇసుక ఇవ్వకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారని సీపీఎం మండల కార్యదర్శి నాగరాజు అన్నారు. వెంటనే ప్రభుత్వం ఉచిత ఇసుక అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం, సీఐటీయూ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, కార్యదర్శి షేక్ బాషా పాల్గొన్నారు.

● **తిరువూరు:** కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని కోరుతూ తిరువూరు బిల్డింగ్ వర్కర్లు తహసీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఇసుక సరఫరా లేక భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయని, వెంటనే ఇసుక సరఫరా చేసి కార్మికులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేకల నాగేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు నల్లగొర్ల బద్రి, సీపీఎం నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, పంతంగి శ్రీనివాసరావు, బి. వెంకటేశ్వరరావు, ఎస్వీ భద్రం పాల్గొన్నారు.

● **నూజివీడు:** రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం పేరుతో గతంలో కంటే ఇసుక ధరలను విపరీతంగా పెంచి ప్రజలకు అందుబాటులో లేకుండా చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రాజు ధ్వజమెత్తారు. నూతన ఇసుక విధానాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ డి.సుబ్బారావుకి వినతిపత్రం అందించారు. ఎన్నికల హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని, భవన నిర్మాణ రంగానికి చెందిన సామగ్రి ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణ కార్యదర్శి ఎన్ఆర్ హనుమాన్లు, పట్టణ కమిటీ సభ్యులు శోభనాద్రి, మండల కమిటీ సభ్యులు బోసు, లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

● **ముసునూరు:** ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత ఇసుక హామీని తక్షణమే నెరవేర్చాలని సీపీఎం జిల్లా నేత జి.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ముసునూరులో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్ఐ దీపికకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొడవలి శ్రీను, కంచర్ల దుర్గారావు, శ్రీను, రమేష్, వెంకటేశ్వరరావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.


తిరువూరు తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న భవన నిర్మాణ కార్మికులు


ఎ.కొండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



కొండపల్లిలో ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

అభివృద్ధికి కృషి చేయాలి

జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ కృష్ణంరాజు

నూజివీడు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కృష్ణంరాజు మాట్లాడుతూ నిధుల లభ్యత, ప్రాధాన్యతను బట్టి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. గ్రామాల్లో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉందని, జ్వరం తగ్గినా నెల రోజులకు పైగా కాళ్లు, కీళ్ల నొప్పులు తగ్గడం లేదని, దీని నివారణకు ఏమి చేయాలో కూడా ప్రజలను చైతన్యం చేయడంలో వైద్యాధికారులు విఫలమయ్యారన్నారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఉన్నా ఉపయోగం లేదని చెప్పారు. ఇప్పటి నుంచైనా వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి జ్వర బాధితులకు తగిన వైద్యాన్ని అందించడంతో పాటు మందులు అందించాలన్నారు. నూతన ఎంపీడీఓ సి.రాఘవేంద్రనాథ్ ప్రజాప్రతినిధులకు పరిచయం చేసుకున్నారు. పలు ప్రభుత్వ శాఖలపై సమీక్ష నిర్వహించారు. వైస్ ఎంపీపీ దండుబోయిన స్వర్ణలత, ఇన్‌చార్జి తహసీల్దార్ డి.సుబ్బారావు, హెచ్ఓ ఆర్ హేమ, ఏఓ ఆలూరు చాముండేశ్వరి, ఏపీఓ సోమేశ్వరి, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అధికారులు

మైలవరం: మైలవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.అనూరాధ శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా జి.కొండూరు నుంచి ఆమె మైలవరం వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. మైలవరం మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఎంపీడీఓ అనూరాధకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

జి.కొండూరు ఎంపీడీఓగా రామకృష్ణనాయక్

జి.కొండూరు: జి.కొండూరు ఎంపీడీఓగా బీవీ రామకృష్ణ నాయక్, ఈఓపీఆర్డీగా కె. శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈగా సీహెచ్ సాంబశివరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయా శాఖల సిబ్బంది నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు అభినందనలు తెలిపారు.

విస్సన్నపేట ఎంపీడీఓగా చిన్నరాట్నాలు

విస్సన్నపేట: విస్సన్నపేట ఎంపీడీఓగా చేకు చిన్నరాట్నాలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా చల్లపల్లిలో ఎంపీడీఓగా పని చేసి విస్సన్నపేటకు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన ఎస్. వెంకటరమణ గుంటూరు జిల్లా బట్టిప్రోలుకు బదిలీపై వెళ్లారు.

● **ముసునూరు:** ఏపీఎం రాంబాబు శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దువ్వూరి పద్మావతి అధ్యక్షతన మండలంలో వెలుగు సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. సీసీలు పాల్గొన్నారు.

గ్రాఫిక్ డిజైనింగ్‌లో విద్యార్థులకు శిక్షణ

మైలవరం: ఫొటోషాప్, డీటీపీ వర్క్స్, పేజ్ మేకర్, గ్రాఫిక్ డిజైన్‌లో శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఎంఎఫ్‌జే ఇన్‌స్టిట్యూట్ మైలవరం అధిపతి వి.క్రాంతికుమార్ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో బీకాం, బీబీఏ లాజిస్టిక్స్ విద్యార్థులకు మల్టీ మీడియా గ్రాఫిక్ డిజైనింగ్‌పై ఒక రోజు వర్క్‌షాపు శుక్రవారం నిర్వహించారు. గ్రాఫిక్ డిజైన్, పేజ్ మేకర్, ఫొటోషాప్, డీటీపీ వర్క్స్ ఎలా చేయాలి అనే విషయాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రెస్ రిపోర్టర్లు, న్యూస్ పేపర్ డిజైనర్, ఫిల్మ్ ఇండస్ట్రీ, కార్టూన్ డిజైనర్, యాడ్ మేకింగ్, ఫొటో ఎడిటింగ్‌లో ఉద్యోగాలు పొందే అవకాశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అదనపు స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. కామర్స్ విభాగాధిపతి ఎం. శ్రీనివాసరావు, ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్కే కరీముల్లా, వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారావు, కామర్స్ అధ్యాపకులు జి.నారాయణరావు, కె.శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముసునూరు ఈఓపీఆర్డీ శ్రీనివాస్‌కు వీడ్కోలు



ముసునూరు: ప్రతి ఉద్యోగికీ బదిలీ ఓ మజిలీ అని, ఎక్కడైనా సమర్థవంతంగా పని చేయడమే ఉద్యోగ ధర్మమని ఎంపీడీఓ జి.రాణి అన్నారు. ఇప్పటివరకు ముసునూరు ఈఓపీఆర్డీగా పనిచేసిన శ్రీనివాస్ శుక్రవారం మండలం నుంచి రిలీవ్ అయ్యారు. ప్రభుత్వ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన కాకినాడ జిల్లా కరప ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా పనిచేస్తూ ఫిబ్రవరిలో ముసునూరు వచ్చారు. తిరిగి కరపలో రిపోర్టు చేయనున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అధ్యక్షతన ఏఓ సాయిరాము, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు.

పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

మైలవరం: జీవకోటి మనుగడను, శ్రేయస్సును అభిలషించే దేవత బతుకమ్మ అని శ్రీ లీలావతి గిరిజన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ అన్నారు. మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో దసరా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రకరకాల పూలతో ఏర్పాటు చేసిన బతుకమ్మలను తలపై ధరించిన విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యం చేసి అలరించారు. పాఠశాల కార్యదర్శి జె. రాధాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు చిత్తపూరు విద్యార్థి



చాట్రాయి: మండలంలోని చిత్తపూరు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థి పారేపల్లి మధు కల్యాణ్ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 5, 6, 7 తేదీల్లో వైజాగ్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో కృష్ణా జిల్లా తరపున ఆడనున్నట్లు పీఈటీ ప్రభాకర్ తెలిపారు. మధు కల్యాణ్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఆలయానికి ఫ్యాన్ల బహూకరణ

ఆగిరిపల్లి: శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి తాడేపల్లి చొప్పరమెట్లకు చెందిన ప్రత్తిపాటి సురేష్ రూ.30 వేలు విలువ చేసే 20 సీలింగ్ ఫ్యాన్లను ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్‌బాబుకు శుక్రవారం అందజేశారు. దాత పత్తిపాటి సురేష్‌కు ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

టెట్ పరీక్షకు 80 మంది గైర్హాజరు



తిరువూరు: ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తిరువూరు శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. రెండు సెషన్స్‌లో 246 మంది అభ్యర్థులను ఈ పరీక్షా కేంద్రానికి కేటాయించగా, 80 మంది గైర్హాజరయ్యారు. ఉదయం పేపర్-2ఏ తెలుగు పరీక్ష, మధ్యాహ్నం పేపర్-2ఏ ఇంగ్లిష్ పరీక్ష జరిగాయని చీఫ్ సూపరింటెండెంట్ నాగేంద్రబాబు తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ పరీక్షల పరిశీలకుడు ఎస్ఎస్ రాజు పర్యవేక్షించారు.

నకిలీ విత్తనాలతో నష్టం

ఆదుకోవాలని రైతుల వినతి

ఎ. కొండూరు: నకిలీ విత్తనాలు కొని ఎ. కొండూరులోని పలువురు మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. తిరువూరులోని ఒక ప్రైవేటు విత్తన డీలరు వద్ద సాయికృప 333, తేజ 9 రకాల మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాలను కొనుగోలు చేసిన ఎ.కొండూరు గ్రామానికి చెందిన రైతులు వాటిని సాగుచేయగా మొక్క ఎదిగినా పంట దిగుబడి కనిపించక దిగాలు చెందారు. పంటకు కావలసిన నీరు, ఎరువులు అందించినప్పటికీ ఎటువంటి ఫలితం కనిపించలేదని రైతులు తెలిపారు. ఎకరాకు రూ.50వేల పెట్టుబడి పెట్టి మొక్కజొన్న సాగుచేస్తున్నామని, తమకు చివరికి అప్పులే మిగిలాయని ఎ.కొండూరుకు చెందిన రైతులు అక్కసాని రంగారావు, రాఘవులు, కౌలురైతులు కొండూరు సుధారాణి, కాళహస్తి విజయలక్ష్మి, భూక్యా మంగమ్మ, మారేశ్వరరావు, సూరిబాబు వాపోయారు. విత్తన డీలరును పలుమార్లు సంప్రదించగా స్పందన లేదన్నారు. డీలరుపై చర్య లు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరుతూ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మేకల డేవిడ్, నాయకులు ముచ్చింతల వెంకటేశ్వరరావు తదితరులు తహసీల్దారుకు, వ్యవసాయాధికారికి వినతిపత్రాలు సమర్పించారు.

ఆధార్ సేవలు అంతంతమాత్రం

- తిరువూరులో నిలిచిన ఆధార్ కేంద్రాలు
- సచివాలయాల్లో అలంకారప్రాయం
- పోస్టాఫీసులు, బ్యాంకుల్లో ఆధార్ కేంద్రాల మూసివేత


యర్రమాడు గ్రామంలో ఆధార్ డేటా నమోదు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

తిరువూరు: ప్రభుత్వ పథకాలకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అవసరమైన ఆధార్‌కార్డు నమోదు, నవీకరణ లావాదేవీలకు తిరువూరు నియోజకవర్గంలో ఆధార్ కేంద్రాల ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్యధోరణి అవలంభిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని సంక్షేమ పథకాలకు, బ్యాంకింగ్, పోస్టల్, ఇన్సూరెన్స్, ఫైనాన్స్ లావాదేవీలకు, విద్యార్థుల అడ్మిషన్లు, స్కాలర్‌షిప్‌లు, పోటీ పరీక్షలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేయడంతో అధిక సంఖ్యలో అర్జీదారులు ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. ఉచితంగా ఆధార్ నవీకరణకు డిసెంబరు 14 చివరి తేదీగా కేంద్రప్రభుత్వం నిర్ణయించడంతో ఆధార్ కేంద్రాల ఆవశ్యకత పెరిగింది.

ఆధార్ కేంద్రాలు లేక ఇక్కట్లు

తిరువూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నామమాత్రంగా ఆధార్ కేంద్రాలున్నాయి. తిరువూరు పట్టణంలోని పోస్టాఫీసు, స్టేట్ బ్యాంక్‌తో పాటు 18, 3వ వార్డు సచివాయాల్లో ఆధార్ సేవలు గతంలో అందించగా, ప్రస్తుతం ఈ కేంద్రాలు పనిచేయట్లేదు. తిరువూరు మండలం లక్ష్మీపురం, ముష్టికుంట్ల, చింతలపాడు, పెద్దవరం, అక్కపాలెం గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయడం మినహా మండలంలో ఎక్కడా శాశ్వత కేంద్రాలు లేవు. మునుకుళ్ల, లక్ష్మీపురం సచివాలయాల్లో ఆధార్ కేంద్రాల్లో డిజిటల్ అసిస్టెంట్లకే ఆధార్ నమోదు బాధ్యతలు అప్పగించారు. విస్సన్నపేట మండలంలోని తాతకుంట్ల, పుట్రేల, విస్సన్నపేట, నరసాపురం సచివాలయాల్లో, నరసాపురం పోస్టాఫీసులో ఆధార్ నమోదు కేంద్రాలను ప్రారంభించగా ప్రస్తుతం నరసాపురంలో మాత్రమే ఈ కేంద్రాలు నడుస్తున్నాయి. మిగిలినవి సాంకేతిక లోపాలతో నిలిపివేశారు. ఎ.కొండూరు మండలం కంభంపాడు సచివాలయంలో మాత్రమే ఆ మండలంలోని ప్రజలకు ఆధార్ కేంద్రం అందుబాటులో ఉంది. గంపలగూడెం మండలంలో కూడా ఆధార్ కేంద్రాలు కావాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధార్ సేవలు అందిస్తున్నాం

> తిరువూరు మండలంలోని మునుకుళ్ల, లక్ష్మీపురం గ్రామాల్లో ఆధార్ నమోదు కేంద్రాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారు. మండలంలోని గ్రామీణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.
>
> – నాగేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ, తిరువూరు

క్రైమ్ కార్నర్

అక్రమ మైనింగ్‌పై కేసు నమోదు

మైలవరం: రెడ్డిగూడెం గ్రామ రెవెన్యూ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ రవాణా చేస్తున్న ట్రాక్టర్, జేసీబీని రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం స్వాధీనం చేసుకున్నట్లు రెడ్డిగూడెం ఎస్ఐ బి. రామ్మోహన్ శుక్రవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు జరిపే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జి.కొండూరు: బుడమేరు వాగు నుంచి విజయవాడకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను జి.కొండూరు మండల పరిధి కందులపాడు వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఎస్ఐ సతీష్‌కుమార్ పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసులు నమోదు చేసి కోర్టుకు పంపారు. పట్టుబడిన ట్రాక్టర్లలో మైలవరం మండల పరిధి గణపవరానికి చెందినవి రెండు, జి.కొండూరు మండల పరిధి వెల్లటూరుకు చెందిన ఒక ట్రాక్టరు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

భర్త, అత్తమామలపై వేధింపుల కేసు

ఇబ్రహీంపట్నం: పుట్టింటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని తన అత్తమామలు, భర్త మానసికంగా శారీరకంగా హింసిస్తున్నారని స్థానిక ప్రసాద్ నగర్‌కు చెందిన కొమ్మవరపు సుజన పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోసూరు గ్రామానికి చెందిన కొమ్మవరపు డేవిడ్‌రాజుతో సుజనకు వివాహమైంది. భర్త మేకలు కాస్తుండగా, భార్య కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవలి కాలంలో అదనపు కట్నం, 100 మేకలు పుట్టింటి నుంచి తీసుకురావాలని వారు వేధిస్తున్నారు. వేధింపులు తట్టుకోలేక సుజన పుట్టింటికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

జూపూడి(ఇబ్రహీంపట్నం): నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న యువతిని టీవీఎస్ మోపెడ్ ఢీకొట్టిన ఘటనలో యువతికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం గాజులపేటకు చెందిన బత్తుల అరుణ స్థానిక నిమ్రా వైద్యశాలలో నర్సుగా విధులు నిర్వహిస్తోంది. విధులకు వెళ్లే క్రమంలో మండలంలోని జూపూడి వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ఆటో దిగి రోడ్డు దాటుతున్న సమయంలో మోపెడ్ ఢీకొట్టింది. గాయపడిన అరుణను స్థానికులు నిమ్రా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గాయత్రీదేవిగా అమ్మవార్ల దర్శనం


మైలవరం శ్రీపాండురంగస్వామి ఆలయంలో అమ్మవారు


నూజివీడు శివాలయంలో రాజ శ్యామలదేవి అలంకరణలో అమ్మవారు


తిరువూరు శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో గాయత్రీదేవి అలంకారం


ఆగిరిపల్లిలో బాలాత్రిపుర సుందరీదేవి అలంకారం


చనుబండ బీసీ కాలనీలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


నూజివీడు మహిషాసురమర్దిని అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



తిరువూరు గౌరీకేదారేశ్వరాలయంలో అమ్మవారి అలంకారం : విస్సన్నపేటలో గాయత్రీదేవిగా అమ్మవారు

మైలవరం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం అమ్మవార్లు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలు, పందిళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మైలవరంలోని ద్వారకా తిరుమల దత్తత దేవాలయంలో శ్రీకోట మహాలక్ష్మి అమ్మవారు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక విజయవాడ రోడ్డులో ఏర్పాటు చేసిన అమ్మవారిని, తిరువూరు రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించి పూజలు చేశారు.

గాయత్రీదేవిగా కోట మహిషమ్మ దర్శనం

నూజివీడు: స్థానిక శ్రీ కోట మహిషాసురమర్దిని అమ్మవారు శ్రీ గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పట్టణంలోని సరస్వతీ ఆలయంలో సరస్వతీ అమ్మవారిని గాయత్రీదేవిగా, బస్టాండు వద్ద ఉన్న శివాలయంలో అమ్మవారిని రాజశ్యామలా దేవిగా అలంకరించారు.

● **చాట్రాయి:** దేవి శరన్నవరాత్రుల సందర్భంగా శుక్రవారం గాయత్రీదేవిగా దుర్గమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● **ఎ.కొండూరు:** చీమలపాడు, ఎ.కొండూరు, కృష్ణారావుపాలెంతోపాటు పలు గ్రామాల్లో రెండో రోజు శుక్రవారం ఆలయాలు, నవరాత్రి పందిళ్లలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● **విస్సన్నపేట:** స్థానిక ద్వారకా నగర్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు గాయత్రీ దేవిగా పూజలందుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి పందిళ్లు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **తిరువూరు:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండోరోజైన శుక్రవారం శ్రీగౌరీ కేదారేశ్వరాలయంలో ఇష్ట కామేశ్వరీదేవిగా, రాజుపేట అష్టలక్ష్మి ఆలయంలో, సూర్యా రెస్టారెంట్ సెంటర్‌లో గాయత్రీదేవిగా, కనకదుర్గాలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారిని అలంకరించి పూజాదికాలు నిర్వహించారు. రుక్మిణీకృష్ణ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 108 మంది మహిళలు సామూహిక కుంకుమపూజల్లో పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి రుద్రభూమి వద్ద ఉన్న కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రజక వీధి, యాదవుల మండపంలో అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో పూజలందుకున్నారు.

● **ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం కనకదుర్గమ్మ ఆలయం, కాచవరం రామలింగేశ్వరస్వామి ఆలయం, జూపూడి గంగానమ్మ అమ్మవారి ఆలయంతో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి విశిష్ట పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బలివే(ముసునూరు): దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు రెండో రోజు శుక్రవారం లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. బలివేలో రామలింగేశ్వ స్వామి దేవస్థానంలోని రాజరాజేశ్వరి ఆలయంలో ఈఓ సీతారామయ్య ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు, అర్చనలు నిర్వహించారు. ముసునూరులోని తూర్పు, పడమటి రామాలయాల్లో, చెక్కపల్లి, రమణక్కపేట, లోపూడి శ్రీకోదండ రామాలయాల్లో, అమ్మవారికి మహిళలు అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు.


కాచవరం రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు


కిలేశపురంలో గాయత్రీదేవిగా అమ్మవారి అలంకరణ


తిరువూరు సూర్యా రెస్టారెంట్ సెంటర్‌లో గాయత్రీదేవి అలంకారం


బలివేలో లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు